
పూజలు అందుకుంటున్న దుర్గామాత

# వనదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

పాపన్నపేట, అక్టోబర్ 1: ఏడుపాయల వనదుర్గాభవానీ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చన, తలనీలాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ సత్తెల్లి బాలాగౌడ్, ఆలయ ఈవో మోహన్ రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవివీర్‌కుమార్, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్, సంతోష్ తదితరులు ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేశారు. వేద పండితులు శంకర్ శర్మ, పార్థివ శర్మ, మురళీధర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపన్నపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి తగిన బందోబస్తు చర్యలు చేపట్టారు.

## దుర్గమ్మ సేవలో టీఎస్‌పీఎస్‌సీ సభ్యురాలు

ఏడుపాయల వనదుర్గామాతను టీఎస్‌పీఎస్‌సీ సభ్యురాలు సుమిత్రా ఆనంద్ ఆదివారం దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి ఆమె పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


అమ్మవారిని దర్శించుకున్న టీఎస్‌పీఎస్‌సీ సభ్యురాలు సుమిత్రా ఆనంద్

# కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛ భారత్

మెదక్ అర్బన్, అక్టోబర్ 1: మెదక్ కోర్టు పరిసరాల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్ చంద్, స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ కల్పన, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మున్సిపల్ కమిషనర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.


స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు

# కుల వృత్తులకు ఆర్థిక భరోసా

- ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు
- మెదక్ నియోజకవర్గంలో మూడో విడతలో 300 మందికి బీసీ బంధు చెక్కుల పంపిణీ
- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- కులవృత్తుల సంక్షేమానికే బీసీ బంధు
- మెదక్ కలెక్టర్ రాజర్షి షా


మెదక్‌లో మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): బీసీ బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకొని కులవృత్తుల వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లో మెదక్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 300 మంది లబ్ధిదారులకు మూడో విడత బీసీ బంధు చెక్కులను కలెక్టర్ రాజర్షి షాతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేనిసంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తూ సీఎం కేసీఆర్ మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టారన్నారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, దళితబంధు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మెదక్ నియోజకవర్గంలో ఇప్పటికే రెండు విడతలుగా బీసీ బంధు చెక్కులను పంపిణీ చేశామని, బీసీలు ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని తెలిపారు. మెదక్ నియోజకవర్గంలో మూడో విడత బీసీబంధు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, జడ్పీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, లబ్ధిదారులు

## కులవృత్తుల బలోపేతానికి బీసీబంధు..


– మెదక్ కలెక్టర్ రాజర్షి షా



నిరుపేద వర్గాలకు చెందిన కుల వృత్తుల ప్రజల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం బీసీబంధు పథకం ప్రవేశపెట్టిందని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఈ పథకం ద్వారా అధునాతన పరికరాల కొనుగోలుకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్నదన్నారు. ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు. జిల్లా మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కృషితో మూడో విడత పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# బీఆర్‌ఎస్ హయాంలో మహిళా సంఘాల అభివృద్ధి

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి


చేగుంట: వల్భా పూర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, అక్టోబర్ 1: బీఆర్‌ఎస్ సర్కారు హయాంలోనే మహిళా సంఘాల అభివృద్ధి జరుగుతున్నదని మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన నార్సింగిలోని ఐకేపీ కార్యాలయంలో పైఅంతస్తు నిర్మాణానికి ఆదివారం పూజ చేశారు. అనంతరం మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, మహిళా సంఘాల తరపున వారు అభివృద్ధి చెందడానికి రుణాలను అందజేస్తున్నారని అన్నారు. రుణాలను తీసుకొని, అభివృద్ధి చెందాలని, అభివృద్ధి చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలని ఎంపీ మహిళలకు పిలుపునిచ్చారు. అనంతరం వల్భాపూర్‌లోని పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యువజన సంఘాల వారు ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాల్లో ఎంపీ పాల్గొన్నారు. కార్యక్రమంలో చేగుంట ఎంపీపీ చిందం సబిత, జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు ఎర్రం అశోక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మైలరాం బాబు, మహిళా సంఘాల సభ్యులు తదితరులున్నారు.


వల్భా పూర్‌లో గణపతి ఉత్సవాల్లో యూత్‌సభ్యులతో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

# ఓటు వేసేందుకు వృద్ధుల కోసం ప్రత్యేక సదుపాయాలు

మెదక్ కలెక్టర్ రాజర్షి షా

నర్సాపూర్, అక్టోబర్ 1: ఓటు హక్కు వినియోగించుకునేందుకు వృద్ధుల కోసం ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని, వృద్ధులైనప్పటికీ ప్రతి ఒక్కరూ ఓటుహక్కును కలిగిఉండాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని విజన్ ఓల్డ్ ఏజ్ హోంలో కలెక్టర్ పలువురు వృద్ధులను సత్కరించి, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం ఎంతో భాగ్యమన్నారు. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈసారి ఎన్నికల కమిషన్ వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించిందని, బయటకు రానివారి కోసం నేరుగా ఓటు వేసే యంత్రాన్ని దగ్గరకు తీసుకువచ్చి ఓటు వేయించనున్నట్లు పేర్కొన్నారు. నడిచే స్థితిలో ఉన్నవారిని వాహనంలో తీసుకెళ్లి ఓటు వేయించి తిరిగి వాహనంలో తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వృద్ధులకు సేవ చేస్తున్న విజన్ ఓల్డ్ ఏజ్ హోం ప్రతినిధి అభర్ణను కలెక్టర్ అభినందించారు. అనంతరం ఆశ్రమం ఆవరణంలో మొక్కను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాద్రి, ఆర్‌ఐలు సిద్దిరామరెడ్డి, ఫైజల్, సీడీపీవో హేమభార్గవి, సూపర్‌వైజర్ సరళకుమారి, యోగ గురువు సురేందర్‌గౌడ్, వృద్ధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా